చదువు



'మెడిసిన్ చదవాలనేది చిరకాల స్వప్నం! కానీ ఎంసెట్‌లో మంచి ర్యాంకు రాలేదు....' ఇలాంటి విద్యార్థులు నిరాశపడకుండా తమ కల నెరవేర్చుకునే అవకాశం విదేశాల్లో లభిస్తోంది! అక్కడి విద్యాసంస్థల్లో చేరాలంటే ప్రవేశపరీక్ష రాయనక్కర్లేదు; డొనేషన్ల బెడద కూడా లేదు. ఈ రకంగా సులభంగా, పరిమిత బడ్జెట్లోనే వైద్యవిద్యలో ప్రవేశించవచ్చు. పూర్తి అవగాహనతో తగిన జాగ్రత్తలు తీసుకుని కోర్సు పూర్తిచేస్తే డాక్టర్ అవ్వాలనే అభిలాష నెరవేర్చుకోటం సాధ్యమే!

## మెరుగైన ప్రత్యామ్నాయం...

# విదేశీ వైద్యవిద్య

ఎంసెట్-మెడికల్‌లో మంచి ర్యాంకు రాని విద్యార్థులు లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని మంచి ర్యాంకు కోసం మరోసారి ప్రయత్నించటం ఒక పద్ధతి. అయితే- విలువైన సమయాన్ని ఇలా వెచ్చించటం కంటే విదేశాలకు వెళ్ళి వైద్య విద్యలో చేరటం మెరుగైన ప్రత్యామ్నాయమని చాలామంది భావిస్తున్నారు.

విదేశాల్లో వైద్యవిద్య చదవటానికి ప్రవేశపరీక్షలు లేకపోవడం, డొనేషన్లు కట్టాల్సిన అవసరం కానీ, భరించరాని ఫీజు కానీ లేకపోవటంతో విదేశీ ఎంబీబీఎస్ స్వదేశీ విద్యార్థులను ఆకర్షిస్తోంది. ఈ మార్గం క్రమంగా విశ్వసనీయతను పెంచుకుంటోంది.

మన రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు చాలా పరిమితం. ఎంతో మంచి ర్యాంకు వస్తే తప్ప సీటు దుర్లభమే! ఎంసెట్-మెడికల్లో అర్హత పొందినవారిలో సుమారు ఏడు శాతం మంది మాత్రమే ఎంబీబీఎస్ సీట్లను సాధించగలుగుతున్నారు. కొద్దిమంది యాజమాన్య కోటాలో లక్షల్లో డొనేషన్లు కట్టి వైద్య విద్యలో ప్రవేశం పొందగలుగుతున్నారు. మిగిలిన వేలమంది తమ ఆకాంక్షలను తుంచేసుకుని, నిరాశతో ఇతర కోర్సులను ఆశ్రయిస్తున్నారు. ఇటువంటి విద్యార్థులకే నేడు విదేశీ ఎంబీబీఎస్ ఆలంబనగా నిలుస్తోంది.

### సంఖ్య పెరుగుతోంది

విదేశాలకు వెళ్ళి వైద్యవిద్య అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య తొమ్మిదేళ్ళుగా పెరుగుతూ వస్తోంది. విదేశీ విశ్వవిద్యాలయం ఇచ్చిన డిగ్రీ చేతపట్టుకుని, MCI నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులై, మనదేశంలోనే డాక్టర్లుగా ప్రాక్టీస్ చేస్తున్నారు; స్థానిక ఆస్పత్రుల్లో సేవలు అందిస్తూ ప్రావీణ్యం నిరూపించుకుంటున్నారు.

మనదేశం నుంచి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి రష్యా, కిర్గిజిస్థాన్, చైనా, ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్, బెలారస్, జార్జియా, జర్మనీ వంటి దేశాల విశ్వవిద్యాలయాలకు వైద్యవిద్యాభ్యాసం కోసం చాలామంది వెళుతున్నారు. విద్యార్థులు తమకు ఏ దేశం అనుకూలమో, ఏ విశ్వవిద్యాలయంలో చేరితే ప్రయోజనకరమో నిర్ణయం తీసుకోవడానికి కన్సల్టెన్సీలు ఇచ్చే సమాచారంపై మాత్రమే ఆధారపడనక్కర్లేదు. ప్రస్తుతం అక్కడ చదువుతున్నవారి అభిప్రాయాలు కూడా తెలుసుకోవచ్చు. వైద్యవిద్యను అభ్యసించే భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది కాబట్టి వారి ద్వారా విశ్వసనీయమైన సమగ్ర సమాచారం సేకరించటం సులువే.

### గుర్తింపును ఇలా నిర్ధారించుకోవాలి

విదేశీ వైద్యకళాశాలల ఎంపికకు భారతీయ వైద్యమండలి (MCI) కొన్ని మార్గదర్శకాలనూ, సూచనలనూ నిర్దేశించింది. వాటిని ముందుగా తెలుసుకోవాలి. ప్రపంచ ఆరోగ్యసంస్థ (WHO) తన మెడికల్ డైరెక్టరీలో దేశాలవారీగా కళాశాలల వివరాలను పొందుపరిచింది. వాటిలోంచి మాత్రమే ఎంచుకోవాలి. చైనాకు MCI ప్రత్యేక జాబితాను తన వెబ్‌సైట్లో ఉంచింది. వెబ్‌సైట్: www.who.int/hrh/wdms/en

### ముఖ్యమైన జాగ్రత్తలు

- విదేశాల్లో వైద్యవిద్య చదువుకోవటానికి వెళుతున్న విద్యార్థి ఆ దేశానికి చెందిన చట్టాలను గౌరవించాలి. సామాజిక, వాతావరణ పరిస్థితులను అవగాహన చేసుకోవాలి.
- తాము చేరదల్చిన కళాశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమం బోధన ఏ స్థాయిలో ఉన్నదీ పూర్వ విద్యార్థులను అడిగి తెలుసుకోవాలి.
- ఫీజు ఇతరత్రా ఖర్చులు ఎంతవుతాయనే అవగాహన తల్లిదండ్రులకు పూర్తిగా అవసరం. ఇందుకు కూడా పూర్వవిద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించటం మంచిది.
- ఆ దేశంలో ఎటువంటి ఆహారం లభ్యమవుతుందో తెలుసుకోవాలి. భారతీయ భోజనం లభ్యం కానట్టయితే అందుకు సిద్ధపడే వెళ్ళాలి.
- విదేశాలకు ప్రయాణిస్తున్నపుడు జీవిత బీమా, ప్రయాణ బీమా చేసుకోవటం మర్చిపోకూడదు.
- మొదటిసారి విదేశాలకు వెళ్తున్నపుడు ఆ దేశ వాతావరణంలో ఎలాంటి ఆరోగ్యసూత్రాలు పాటించాల్సివుంటుందో కుటుంబ వైద్యులను సంప్రదించాలి. సాధారణ రుగ్మతలకు వాడాల్సిన మందులు వెంట తీసుకువెళ్ళటం మంచిది.
- వెళ్ళిన తొలిరోజుల్లో ఏ విద్యార్థికైనా ఇంటి బెంగ సహజం. ఆరోగ్య సమస్యలూ రావొచ్చు. వీటికి మానసికంగా సిద్ధమవటం మంచిది. వైద్యవిద్య చదవాలనే ప్రధాన లక్ష్యం సడలిపోకుండా జాగ్రత్త వహించాలి.

### అర్హత కోసం...

విదేశాల్లో వైద్యవిద్య అభ్యసించదల్చిన విద్యార్థి అక్కడ చేరేముందు MCI నుంచి Eligibility certificate కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలన అనంతరం ఆ పత్రం విద్యార్థి ఇంటి చిరునామాకు స్పీడ్‌పోస్టులో చేరుతుంది.

ఈ అనుమతి పత్రం పొందాలంటే... 1) దరఖాస్తు చేసిన విద్యార్థి భారతీయ పౌరుడై ఉండాలి. 2) ఇంటర్మీడియట్/ ప్లస్ టూ ఉత్తీర్ణులై ఉండాలి. కోర్సులో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ పాఠ్యాంశాలతో పాటు ఇంగ్లిష్ ఒక బోధనాంశంగా చదివివుండాలి. ఈ పరీక్షలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 40 శాతం మార్కులున్నప్పటికీ అర్హులే. 3) విద్యార్థి వయసు 17 సంవత్సరాలు (అదే సంవత్సరం డిసెంబర్ 31 నాటికి) నిండివుండాలి. MCI వెబ్‌సైట్: www.mciindia.org

### స్వదేశీ-విదేశీ పట్టాలకు తేడా ఉందా?

మనదేశంలో ఎంబీబీఎస్ పట్టా సాధించినవారు ఏదైనా మెడికల్ అసోసియేషన్లో తమ పేరు నమోదు చేసుకుని వైద్యసేవలు అందించవచ్చు. కానీ విదేశాల్లో వైద్యపట్టా పొందినవారు నేరుగా నమోదు చేసుకుని ప్రాక్టీసు చేయటానికి నిబంధనలు అనుమతించవు. ఆ డిగ్రీతో నేరుగా ఉన్నత విద్య చదవటానికీ వీలు లేదు.

స్క్రీనింగ్ టెస్టులో వీరు తప్పనిసరిగా ఉత్తీర్ణత పొందాలి. ఈ టెస్ట్ MCI ఆధ్వర్యంలో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. దీన్ని ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ పరీక్ష (FMGE) గా దీన్ని వ్యవహరిస్తారు. (వెబ్‌సైట్: www.natboard.edu.in/fmge.php) ఈ టెస్టులో ఉత్తీర్ణత సాధిస్తేనే వీరిని భారతీయ వైద్యులుగా పరిగణిస్తారు. ఈ స్క్రీనింగ్ టెస్టును ప్రతి సంవత్సరం మార్చి సెప్టెంబరు నెలల్లో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాలి. ఒకసారి విఫలమైనా నిరాశపడాల్సిన అవసరం లేదు. తిరిగి ఎన్నిసార్లయినా రాసే వెసులుబాటు ఉంది.

ముఖ్యమైన విషయం ఏమిటంటే... భారతీయ విద్యార్థి విదేశాల్లో ఎక్కడ చదివినా ఈ పరీక్ష రాయాల్సిందే. ఈ స్క్రీనింగ్ టెస్ట్ నుంచి ఏ దేశానికీ మినహాయింపు లేదు.

### పాస్‌పోర్టు ఎలా పొందాలి?

విద్యార్థులు విదేశాలకు వెళుతున్నపుడు పాస్‌పోర్టు, వీసా స్టాంపింగ్ తప్పనిసరి. పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నపుడు కావలసిన పత్రాలను ముందుగా సిద్ధం చేసుకోవాలి.

- జన్మదిన ధ్రువీకరణ పత్రం (జారీ చేసేవారు: గ్రామ కార్యదర్శి/ మ్యునిసిపల్ అధికారి/ జనన మరణాల రిజిస్ట్రార్) తీసుకోవాలి. 1989 జనవరి 26 తర్వాత పుట్టినవారి విషయంలో పదోతరగతి మార్కులపై ఉన్న తేదీని పరిగణనలోకి తీసుకోరు.
- స్టడీ సర్టిఫికెట్లను, చిరునామాను తెలిపే ప్రభుత్వం జారీ చేసిన పత్రాలు, రేషన్ కార్డు, ఎమ్మార్వో జారీ చేసిన పత్రాలు, బ్యాంకు పాస్ పుస్తకం, టెలిఫోన్ బిల్లు వంటి పత్రాలను పొందుపర్చాలి.
- త్వరగా పాస్‌పోర్టు కావాలనుకుంటే తత్కాల్ పథకంలో పొందవచ్చు. దీనికోసం 1) సాధారణ ఫీజు రూ.1,000తో పాటు మరో రూ.1500 అదనంగా కట్టాల్సివుంటుంది. 2) వెరిఫికేషన్ సర్టిఫికెట్ జత చేయాలి. పాస్‌పోర్టు వెబ్‌సైట్: www.passport.nic.in

### విదేశీ వైద్యవిశ్వవిద్యాలయాల్లో ఫీజులు

మనరాష్ట్రం నుంచి విద్యార్థులు ఎక్కువగా వెళ్తున్న కొన్నిదేశాలు: అక్కడి విశ్వవిద్యాలయాల్లో ఫీజుల వివరాలు

| దేశం | కోర్సు కాలం | ఏడాదికి ఫీజు |
|---|---|---|
| కిర్గిజిస్తాన్ | 5 ఏళ్ళు | రూ. 1.03 లక్షలు |
| చైనా | 6 ఏళ్ళు | రూ.2 లక్షలు |
| ఫిలిప్పీన్స్, సెంట్రల్ అమెరికా | 5 1/2 ఏళ్ళు | రూ. 1.97 లక్షలు |
| రష్యా, ఉక్రెయిన్, బెలారస్ | 6 ఏళ్ళు | రూ.1.64 లక్షలు |
| జార్జియా | 6 ఏళ్ళు | రూ.1.64 లక్షలు |

### కష్టం కాదు- స్క్రీనింగ్ టెస్ట్

విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలనుకునేవారిలో చాలామంది కోర్సు పూర్తయ్యాక రాసే స్క్రీనింగ్ టెస్ట్ గురించి ఆందోళన చెందుతుంటారు. ఈ టెస్ట్ మల్టిపుల్ చాయిస్‌లో ఉంటుంది. ఉదయం సెషన్ 150 మార్కులకూ, మధ్యాహ్నం సెషన్ 150 మార్కులకూ. 50 శాతం (150 మార్కులు) వస్తే పాసైనట్టు. ఈ పరీక్ష చాలా కష్టమనీ, తొలిసారే ఉత్తీర్ణత సాధించలేమనీ చాలామంది భావిస్తుంటారు.



'ఇది కేవలం అపోహ మాత్రమే' అంటున్నారు 2010లో మొదటి ప్రయత్నంలోనే స్క్రీనింగ్ టెస్టులో ఉత్తీర్ణులైన డా. ప్రవీణ. ఉదయం పూట నాన్ క్లినికల్ విభాగంలో, మధ్యాహ్నం పూట క్లినికల్ విభాగంలో పరీక్ష జరుగుతుంది. 'నాన్ క్లినికల్ ఎలాగూ స్కోరింగే. క్లినికల్‌లోనే ఎక్కువ మార్కులు తెచ్చుకోడానికి కృషి చేయాలి. అప్పుడే తేలిగ్గా పాస్ కావొచ్చు.

తప్పు సమాధానాలకు మైనస్ మార్కులేమీ లేవు. విద్యార్థి చదివే కళాశాలలో ఇంగ్లిష్ మీడియంలో బోధన సరిగా ఉంటే ఈ టెస్ట్ అసలు అవరోధమే కాదు. నాలుగో సంవత్సరం నుంచీ స్క్రీనింగ్ టెస్టును దృష్టిలో పెట్టుకుని సబ్జెక్టులను అధ్యయనం చేయటం మేలు' అని ఆమె తెలిపారు.

dr.praveenakz@gmail.com